క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రోలుగుంట: ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే అంశంపై ఆదివారం రోలుగుంట, రావికమతం మండలాల పార్టీ నాయకులతో కొత్తకోట రవిటాకీస్ హాలులో సమావేశం జరగనుందని కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాస్, యర్రంశెట్టి రాజారావు తెలిపారు. శనివారం ఎంపీపీ చాంబరులో వారు మాట్లాడుతూ మంత్రి బొత్స సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొనే సమావేశానికి గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం

నర్సీపట్నం: శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కళాశాల వసతి గృహంలో ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.చిన్నారావు తెలిపారు. సాయంత్రం భోజనం తర్వాత 7 నుంచి 8 గంటల వరకు స్టడీ అవర్ ఉంటుందన్నారు. సబ్జెక్టు వారీగా రోజుకోక అధ్యాపకులు స్టడీ అవర్ నిర్వహిస్తారన్నారు. హాస్టల్ నుంచి బయటకు వెళ్లకుండా స్టడీ అవర్‌లో విద్యార్థులు తప్పనిసరిగా ఉండాలన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హిందీ భాష ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి. రాధ వివరించారు. ఐపీఈ 2023లో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో హిందీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు జె. ఫిరదోస్(99/100), సిహెచ్.సాయి దివ్య (99/100)కు ప్రిన్సిపాల్‌తోపాటు హిందీ అధ్యాపకురాలు ఎస్. నిర్మల బహుమతులు అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

తాచేరు కాలువ గేట్లు పరిశీలన

మాడుగుల రూరల్: తాటిపర్తి సమీపంలో తారకరామ జలాశయం నుంచి పొలాలకు సాగునీరు అందించే కాలువ గేట్లను ఎంపీపీ వేమవరపు రామధర్మజ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఇక్కడ కాలువ గేట్లు ఏర్పాటుకు మండల పరిషత్ నుంచి రూ.12 లక్షలు మంజూరు చేశారు. వీటితో చేపట్టిన పనులు పరిశీలించారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. న్నారు. మండల సచివాలయాలు కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు వేమన గణేశ్, ఇందుకూరి నాగరాజు పాల్గొన్నారు.

ఐఏఎస్ శంకరన్‌కు ఘన నివాళి


శంకరన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ ప్రతినిధులు

నర్సీపట్నం: డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐఏఎస్ అధి కారి శంకరన్ 13వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. శంకరన్ చిత్రపటానికి డివిజనల్ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు, చిట్ల చలపతిరావు, ప్రిన్సిపాల్ రాజేశ్వరి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐఏఎస్ అధికారి శంకరన్ ఆదివాసీల అభివృద్ధికి విశేష కృషి చేశారని చలపతిరావు పేర్కొన్నారు. 1984లో గురుకులాల ఏర్పాటుకు ఆయన బాటలు వేశారన్నారు. దళిత నాయకులు యాదగిరి, దాసు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్


పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ రాంబాయి

మాడుగుల: కింతలి వల్లాపురంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారామ్, సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి శనివారం టెంకాయ కొట్టి ప్రారంభించారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇక్కడ రూ.80 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకుతోపాటు 600 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మట్టా గోవింద్, వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్లపురెడ్డి రాంబాబు, తాళ్లపురెడ్డి సోమన్నదొర, డి.రాజునాయుడు పాల్గొన్నారు.


గొలుగొండ: రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


దేవరాపల్లి: గరిశింగిలో వైద్య శిబిరం వద్ద బారులు తీరిన ప్రజలు


రావికమతం: శిబిరానికి పెద్ద ఎత్తున హాజరైన రోగులు


రోలుగుంట: శిబిరం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్నప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోగుల వద్దకే వైద్య సేవలు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విప్ కరణం ధర్మశ్రీ
- గ్రామాల్లో చురుగ్గా సాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

కె.కోటపాడు/దేవరాపల్లి: ప్రతీ కుటుంబానికి మంచి ఆరోగ్యం కల్పించాలన్న లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూపకల్పన చేసినట్లు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కె.కోటపాడు మండలం సూదివలసలోనూ దేవరాపల్లి మండలం గరిశింగిలోనూ శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రోగుల రిజిస్ట్రేషన్, మందులు, వైద్య పరీక్షలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆయా గ్రామాల్లోనే నిపుణులైన వైద్యులతో వైద్యం అందిస్తున్నామన్నారు. ఈ శిబిరాల్లో నయం కాని వ్యాధులకు పట్టణాల్లోని కార్పొరేట్ ఆస్పత్రులకు పంపించి వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. సూదివలస, పాతవలస, గొట్లాం గ్రామాలకు చెందిన 349 మందికి వైద్య సేవలందించినట్లు లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. ఈఎన్‌టీ, ఆప్తాలమిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ ఫిజిషియన్ బి.సాయికిరణ్, సుబ్రహ్మణ్యం, విద్యాసాగర్, వైదేహి వైద్య సేవలందించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు, కిలపర్తి సత్యంనాయుడు, గంతకర్ల సతీష్ పాల్గొన్నారు.

➡ గరిశింగిలో చిల్డ్రన్, ఈఎన్‌టీ స్పెషలిస్టులు భవానీ ప్రసాద్, శిల్పా, జనరల్ వైద్యులు ఎస్. లలిత, గోవిందరెడ్డి 328 మందికి వైద్య సేవలు, 371 మందికి ల్యాబ్ టెస్టులు చేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్య క్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ గూడెపు రాము, ఎంపీటీసీ కోలా గోపి, గూడెపు మోహన్, కాటిపాంనాయుడు, బుగత వెంకటరమణ, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషినళిని, పంచాయతీ సెక్రటరీ పి. యశోద పాల్గొన్నారు.


బుచ్చెయ్యపేట: బంగారుమెట్టలో రక్తహీనత నివారణకు చిన్నారికి ఐరన్ మాత్రలు వేయిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


కె.కోటపాడు: పౌష్టికాహార స్టాళ్లలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ఆరోగ్యవంతులుగా చేయడమే ధ్యేయం

చోడవరం/బుచ్చెయ్యపేట/రోలుగుంట/రావికమతం: రోగుల వద్దకే వైద్యం అందే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శనివారం చోడవరం మండలంరాయపురాజుపేటలోనూ బుచ్చెయ్యపేట మండలం లోపూడి సచివాలయం శివారు బంగారుమెట్టలోనూ రోలుగుంట మండలం అడ్డసరం సచివాలయంలోనూ రావికమతం మండలం కొత్తకోటలోనూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వీటిని శనివారం ఆయన సందర్శించారు. పూర్తి స్థాయిలో అందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందన్నారు. ఈ ఉద్దేశంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. చిరుధాన్యాలు పండించి తిని ఆరోగ్యంగా ఉండాలన్నారు. బంగారుమెట్టలో వైద్యులు శకుంతల, కిరణ్, శృతి తదితరులు 289 మందికి వైద్య సేవలు అందించగా, వీరిలో 67 మందిని మెరుగైన వైద్య సేవలకు ఎంపిక చేశారు. కొత్తకోటలో ప్రత్యేక వైద్యనిపుణులు సువర్ణ, సురేష్, రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారులు దుర్గాప్రసాద్, శ్రీరజని 306 మంది రోగులకు బీపీ, సుగర్, తదితర పరీక్షలు చేశారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, సర్పంచ్ మేరుగు కుమారి బాబూరావు, నాయకులు రమేష్, మధు, రమణ, డీపీవో శిరీషారాణి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు పాల్గొన్నారు.

➡ గవరవరం పీహెచ్ ఆధ్వర్యంలో రాయపురాజుపేట శిబిరంలో 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండారు సత్యనారాయణ, కార్యదర్శి డాక్టర్ దేవరపల్లి రవి పరిశీలించారు. ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ తిరుమలబాబు, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, శీమునాపల్లి సర్పంచ్ కురకూటి భోగేష్ పాల్గొన్నారు.

➡ రోలుగుంట పీహెచ్‌సీ వైద్యురాలు ధనలక్ష్మి, బుచ్చింపేట పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసరాజు, విశాఖ శంఖర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు, గైనకాలిజిస్టు తదితరులు అడ్డసరంలో 216 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు గొర్లి వరలక్ష్మి, వెంకట సౌజన్య, లక్ష్మీదేవి, సర్వమంగళ, నూకరత్నం, లావణ్య ఇక్కడ స్టాల్‌ను ఏర్పాటు చేసి దిశ యాప్, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. రోలుగుంట తహసీల్దార్ కె.వరహాలు పాల్గొన్నారు.

గొలుగొండ: రావణాపల్లిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఇక్కడ 179 మంది రోగులకు వైద్యాధికారులు మధుసూదనరావు, హరి, ప్రవీణ్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, కొమిరి సర్పంచ్ రాజుబాబు పాల్గొన్నారు.

మాడుగుల: గిరి ప్రాంతాల ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష శ్రీరామ రక్షగా మారిందని ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ తెలిపారు. శనివారం అవురువాడ పంచాయతీ లోవ వీరనారాయణంలో వైద్యాధికారులు సంతోష్‌కుమార్, అభినాబ్, నాగదివ్య, మాలెంనాయుడు, లీలాప్రసాద్, ప్రసాద్ పాత్రుడు 310 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సీడీపీవో శ్రీదేవి ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాళ్లను ఎంపీపీ, వైస్ ఎంపీపీ, తహసీల్దార్ పీవీరత్నం సందర్శించారు. ఎంపీడీవో మీనాకుమారి, సర్పంచ్ కిముడు మోదహైందవ గుప్తేశ్వరి, నాయకులు బన్నీ, చెదల కృష్ణమ్మ దొర పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: చీడికాడ మండలం చుక్కపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలె గ్రామంతోపాటు చెట్టుపల్లికి చెందిన 450 మంది వైద్య సేవలు పొందారు. చీడికాడ, పెదగోగాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు సునీల్, దాడి అప్పారావునాయుడు, తదితన వైద్యులు పరీక్షించారు. శిబిరాన్ని ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారద జానకీరామ్, ఎంపీడీవో జయప్రకాష్‌రావు, సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సుంకర వెంకటలక్ష్మి పరిశీలించారు. ఐసీడీఎస్ సీడీపీవో సిహెచ్ శ్రీదేవి, నాయకులు మజ్జి దేవానందం, సుంకర తిరుమలనాయుడు, చెట్టుపల్లి మాజీ సర్పంచ్ పాతాళం చిన్నంనాయుడు పాల్గొన్నారు.

మాకవరపాలెం: పి.పి.అగ్రహారంలోని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 271 మందికి వైద్యాధికారులు సీతారామలక్ష్మి, అజయ్, సాయితేజ, చరణ్, స్పెషలిస్టు వైద్యులు పరీక్షించారు. వీరిలో అవసరమైన వారికి మందులు అందజేశారు. పది మంది రోగులకు మెరుగైన చికిత్సలు అవసరమని గుర్తించారు. ఎంపీడీవో అరుణశ్రీ, సిహెచ్‌వో రమేష్, ఎంఈవో మూర్తి, సచివాలయ, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం: జగనన్న ఆరోగ్య సురక్షతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వైస్ ఎంపీపీ పైల సునీల్ అన్నారు. గన్నవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 502 మంది రోగులను వైద్యాధికారులు ప్రసన్న, పద్మప్రియ, ఎం.రాజేష్‌నాయుడు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి, తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు, గన్నవరం, వై.బి.అగ్రహారం సర్పంచులు బి.సత్యనారాయణ, కోసూరి విజయ, గొర్లె సత్యవేణి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు పాల్గొన్నారు.


మాకవరపాలెం: పి.పి.అగ్రహారంలో రోగిని వీల్‌చైర్‌లో తీసుకెళుతున్న సిబ్బంది


మాడుగుల రూరల్: చుక్కపల్లిలో రిజిస్ట్రేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది


మాకవరపాలెం: పి.పి.అగ్రహారంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు


నాతవరం: గన్నవరంలో సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ పైల సునీల్

రెండో సారి జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం

- టీడీపీ కుట్రలను తిప్పికొడదాం
- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


నర్సీపట్నం: రానున్న ఎన్నికల్లో వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంగా గెలిపించడమే మనందరి ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. గృహసారథులు, కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తల తో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే అంశంపై ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అభివృద్ధి అంటే టీడీపీలా గ్రాఫిక్స్ కాదని, పేదలందరికీ సంక్షేమం, అభివృద్ధి అందించడమన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 2014 ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన టీడీపీ అధికారంలోకి వచ్చాక డ్వాక్రా మహిళలు, రైతులు, నిరుద్యోగులను ఏవిధంగా మాయ చేసిందో ప్రజలకు వివరించాలన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యంతో పాటు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. మనమంతా ఐక్యతతో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. నేడు ఇంటికే వచ్చి వైద్య సేవలందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష గురించి వివరించాలన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని.. నేడు చేస్తున్న అభివృద్ధిని గణాంకాలతో సహా వివరించేలా పుస్తకాలు ముద్రించారన్నారు. పార్టీ మండలాధ్యక్షులు రుత్తల సత్యనారాయణ, రుత్తల శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, మండల సచివాలయాల కన్వీనర్ చిటికెల రమణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, తూర్పు కాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, ఎంపీటీసీ రుత్తల సర్వేశ్వరరావు, సర్పంచ్ ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సమావేశానికి హాజరైన గృహసారధులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

కొత్తపెంటలో పిచ్చిమొక్కల తొలగింపు

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పర్యవేక్షణలో శనివారం కొత్తపెంటలో గ్రామస్తులు శ్రమదానం చేపట్టారు. సర్పంచ్ రొంగలి వెంకటరావు ఆధ్వర్యంలో యువకులు, వృద్ధులు సైతం కత్తి, కొడవలి చేతపట్టి గ్రామం నుంచి మేడిచర్ల రాజపాత్రుని కల్లాల వరకు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలు, పొదలు తొలగించారు. స్వచ్ఛందంగా పాల్గొన్న గ్రామస్తులను డిప్యూటీ సీఎం అభినందించారు. ఇదే స్ఫూర్తితో నియోజకవర్గంలోని మిగిలిన గ్రామాల్లో పనులు చేపట్టాలని సూచించారు.


డిప్యూటీ సీఎం బూడి పర్యవేక్షణలో తుప్పలు తొలగిస్తున్న గ్రామస్తులు

విధిగా ఈ-కేవైసీ నమోదు


రైతులకు వివరిస్తున్న ఏడీ శ్రీదేవి

నర్సీపట్నం: ప్రతీ రైతు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని నర్సీపట్నం వ్యవసాయశాఖ ఏడీ శ్రీదేవి సూచించారు. నీలంపేటలో శనివారం రైతులతో ఆమె మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకోవడంతో పాటు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు. రావణాపల్లి జలాశయం మాజీ చైర్మన్ లాలం అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాదిలో భారీ అన్నసమారాధన

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజరు పంచాయతీలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక చవితి సంబరాల్లో భాగంగా ఇక్కడ ఎగువవీధి రామకోవెల వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధనలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జెడ్పీటీసీ రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితానారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, నాయకులు గుమ్మిడి ప్రసాద్, దొండా గిరిబాబు, రాజా పాల్గొన్నారు.

దేవరాపల్లి: వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ఎస్‌ఐ దంపతులను స్థానిక పెదరాయ సెంటర్‌కు చెందిన హనుమాన్ యూత్ సభ్యులు శనివారం రాత్రి ఘనంగా సత్కరించారు. ముందుగా ఎస్‌ఐ నాగేంద్ర దంపతులు వినాయకుడిని దర్శించుకున్నారు.

కె.కోటపాడు: గొండుపాలెంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం రాత్రికి వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం నిర్వహించారు. బండారు లక్ష్మణరావు, పెట్ల ఈశ్వరరావు, గజ్జి శ్రీను, కాపారపు నర్సింహమూర్తి, ఎలమంచిలి దండు పాల్గొన్నారు.


వడ్డాది వినాయకుని మండపంలో పూజలు చేస్తున్న విప్ ధర్మశ్రీ


దేవరాపల్లిలో ఎస్‌ఐ నాగేంద్ర దంపతులను సత్కరిస్తున్న హనుమాన్ యూత్ సభ్యులు

మాజీ సర్పంచ్ మృతి పార్టీకి తీరని లోటు

- సత్యనారాయణ సంతాప సభలో ఎమ్మెల్యే గణేష్


సంతాప సభ వద్ద ఎమ్మెల్యే గణేష్, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, చింతకాయల సన్యాసిపాత్రుడు

నాతవరం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ వర్రే సత్యనారాయణ మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. శనివారం ఎం.బి.పట్నంలో సత్యనారాయణ సంతాప సభకు ఎమ్మెల్యేతోపాటు మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్ పాల్గొన్నారు.

కింతలి గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి

మాడుగుల రూరల్: కింతలి గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ఎంపీపీ వేమవరపు రామధర్మజ తెలిపారు. శనివారం ఇక్కడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వార్షిక గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. బీసీ వసతి గృహం నుంచి సలాది వారి కళ్లాల వరకు రూ.3 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టగా, మరో కిలోమీటరు రోడ్డు పనులకు నిధులు చాలటం లేదని, ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్ జామి చిన్న మాట్లాడుతూ రీసర్వే అనంతరం ఒమ్మలి రెవెన్యూ పరిధి నుంచి కింతలికి సవడ చెరువును అప్పగించారని హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల భూముల రీసర్వే పూర్తి చేసుకున్న 210 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను ఎంపీపీ పంపిణీ చేశారు. సర్పంచ్ మైచర్ల భవానీ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఎంపీటీసీ మైచర్ల సన్యాసిరావు, జేడీపేట సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.


రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రామధర్మజ

దేవరాపల్లి నుంచి ఆర్కే బీచ్‌కు ప్రత్యేక ఆర్టీసీ బస్సు

దేవరాపల్లి: ప్రయాణికుల సౌకర్యార్థం దేవరాపల్లి నుంచి ఆర్కే బీచ్‌కు కొత్త బస్సు సర్వీస్‌ను సింహాచలం ఆర్టీసీ డిపో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ బస్సు దేవరాపల్లి నుంచి కొత్తవలస, పెందుర్తి, వేపగుంట, సింహాచలం, హనుమంతువాక, మద్దిలపాలెం జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ సెంటర్, కేజీహెచ్, కలెక్టరేట్ మీదుగా ఆర్కే బీచ్‌కు చేరుకుంటుంది. ఇటు దేవరాపల్లి నుంచి, అటు ఆర్కేబీచ్ నుంచి ప్రతీ గంటకు బస్సు బయలు దేరుతుంది. దేవరాపల్లి నుంచి ఉదయం 8:15 నుంచి సాయంత్రం 6:20 గంటల వరకు, ఆర్కే బీచ్ నుంచి ఉదయం 5:30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు సర్వీస్ అందుబాటులో ఉంటుందని సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రాజశేఖర్ శనివారం తెలిపారు. అనకాపల్లి, విజయనగరం, అల్లూరి జిల్లాల నుంచి కేజీహెచ్, ఆర్కే బీచ్‌కు వెళ్లే ప్రయాణికులకు ఈ బస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో మెరుగైన ఆరోగ్యం

కె.కోటపాడు: ఐదేళ్లలోపు చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తిని పెంపొందించేందుకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. గుల్లేపల్లి ఆరోగ్య ఉప కేంద్రం వద్ద శనివారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఐదేళ్లలోపు 29 మంది చిన్నారులకు పెంటావాలెంట్, రోటా, డీపీటీ, ఐపీవీ, పీసీవీ వ్యాక్సిన్ వేశారు. ముఖ్యంగా చిన్నారులకు టీకాలను వేయడం వల్ల వారిలో వ్యాధులను ఎదుర్కొనే శక్తి సమకూరి ఆరోగ్యంగా ఉంటారని రాజు తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.